క్లుప్తంగా

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా పరశురాం గౌడ్



తిరుమలగిరి(నాగార్జున సాగర్): టీఎస్‌పీఆర్ టీయూ తిరుమలగిరి మండల నూతన అధ్యక్షుడిగా మండలంలోని యల్లాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొక్క పరశురాంగౌడ్ ఎంపిక య్యారు. శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దవూర : వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున మొలకెత్తిన విత్తనాలు, మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కూన్‌రెడ్డి విజయకుమారి అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని వన నర్సరీని పరిశీలించి మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతీరోజు నీటి తడులు వేయాలని, మొక్కలకు నీడ కోసం గ్రీన్ మ్యాట్‌తో చలువా పందిళ్లు వేయాలని సూచించారు. తొమ్మిదో విడత హరితహారానికి గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఆమె వెంట స్థానిక పంచాయతీ కార్యదర్శి పానుగోతు ధాకునాయక్, ఈజీఎస్ ఎఫ్‌ఏ శ్రీను తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి

దేవరకొండ : అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మే నెలలో ఎండలు తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన విధంగా వేసవి సెలవులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎండల తీవ్రతకు సెంటర్లకు చిన్న పిల్లలు రావడం ఇబ్బందికరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు .ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ప్రకటించాలని ఆయన కోరారు.

కేంద్రంపై పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బషీర్

పెద్దవూర : సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని బీఆర్ ఎస్‌కేవీ రాష్ట్ర కార్యదర్శి షేక్ బషీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్‌కేవీ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదిస్తూ, కార్మిక ఉద్యోగ భద్రత, సంఘాల నిర్మాణం లేకుండా చేయడానికి దుర్మార్గమైన ఆలోచనలు చేస్తుందని విమర్శించారు. 137వ మేడేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ టీయూ మండల అధ్యక్షుడు చినపాక రమేష్, నాయకులు సైదులు, రఘువర్ధన్, మట్టపల్లి అంజిరెడ్డి, మల్లయ్య, భీమయ్య, దుర్గయ్య, కొండల్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఐ బాబు, ట్రస్ట్ మేనేజర్ రాంబాబు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్‌ఐ పెద పంగ బాబు, నాట్కోట్రస్ట్ మేనేజర్ రాంబాబు అన్నారు. నాట్కోట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని నెల్లికల్లు గ్రామపంచాయతీలో నాట్కోట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాట్కోట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ పోటీల్లో 15జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్ ఎస్‌ఐ రాంబాబు, ఉప సర్పంచ్ కార్తిక్, నాట్కోట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరత.. నిలిచిన కొనుగోళ్లు

- ఐకేపీ కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- అధికారులు స్పందించాలని వేడుకోలు



వీర్లగడ్డతండాలో ఐకేపీ కేంద్రంలో కాంటా వేయని ధాన్యం రాశులు



వీర్లగడ్డతండాలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

హాలియా : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక పక్క మారుతున్న వాతావరణ పరిస్థితులకు తోడు మరో పక్క లారీలు రాక ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం రాశులు పోసిన రైతుల్లో మరింత ఆందోళన మొదలైయ్యింది. అనుముల మండలంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం బస్తాలోకి ఎత్తి, లారీల్లో తరలి పోయేదాకా రైతులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. వారం రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో ఆయా ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలు ఎప్పుడు వస్తాయో తమ ధాన్యాన్ని ఎప్పుడు తూకం వేసి లారీల్లోకి ఎత్తుతారోనని రైతులు కళ్లల్లో ఒత్తులు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

పేరుకుపోయిన ధాన్యం

అనుముల మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏప్రిల్ 20 నుంచి కొనుగోళ్లను ప్రారంభించారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఐకేపీ కేంద్రాల్లో 458మంది రైతుల వద్ద నుంచి రెండు లక్షల పదివేల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి లారీల్లో ఎగుమతి చేసి మిల్లర్స్‌కు తరలించారు. ఇంకా ఆయా కొనుగోలు కేంద్రాలకు సుమారు లక్ష బస్తాలకు పైగా రైతులు తమ ధాన్యాన్ని తీసుకొచ్చారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన, లారీల కొరతతో కాంటాలు వేయని సుమారు లక్ష బస్తాల ధాన్యపు రాశులు నిల్వ ఉన్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వారం రోజులుగా లారీలు రాక సకాలంలో ధాన్యం కాంటాలు కాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు ఆయా కొనుగోలు కేంద్రాల్లో లక్ష బస్తాల ధాన్యం నిల్వలు పేరుకుపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క వాతావరణ పరిస్థితుల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో లారీలను రప్పించి ఐకేపీ కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం ఎగుమతి జరిగేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

లారీల కోసం ఎదురుచూస్తున్నాం



యాసంగిలో నేను 10 ఎకరాల వరి సాగు చేశా. వారం రోజుల క్రితం వీర్లగడ్డతండాలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి 600 బస్తాల ధాన్యాన్ని తీసుకువచ్చాను. కొనుగోలు కేంద్రానికి సకాలంలో లారీలు రాక, ధాన్యం కాంటాలు జరగడం లేదు. అధికారులు స్పందించి లారీలను రప్పించి త్వరితగతిన కాంటాలు జరిగేలా చూడాలి.

–జటావత్ మంగ్యా, రైతు, వీర్లగడ్డతండా

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

డిండి : దేవాలయాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లితండాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కోట మైసమ్మ తల్లి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం మండలంలోని చెర్కుపల్లిలో నూతనంగా నిర్మించే గ్రామపంచాయతీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ఆర్‌వీఆర్, పీఏసీఎస్ చైర్మన్ నాగార్జునరెడ్డి, యువజన విభాగ మండలాధ్యక్షుడ మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు ఒజ్జ అలివేలు పర్వత్‌రెడ్డి, ఏమిరెడ్డి సుధామణి వెంకట్‌రెడ్డి, బిచ్యానాయక్, కోఆప్షన్‌మెంబర్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గుర్రంపోడు : అకాల వర్షాలు కురిసేలా ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకుని వస్తే గరిష్ఠ మద్దతు ధర లభిస్తుందని, ధాన్యాన్ని తప్పనిసరిగా తాలు లేకుండా తూర్పారపట్టాల న్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ప్యాడీ క్లీనర్లను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ హుస్సేన్ ఉన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలిన మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు ఐకేపీ కేంద్రాలను పరిశీలించిననంతరం మార్కెట్ యార్డులో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఐకేపీ కేంద్రాల్లో కొద్ది రోజులగా రైతు తెచ్చిన ధాన్యం అమ్మకం కాకపోవడంతో వాతావరణంలో మార్పుల వలన వర్షం వస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఐకేపీ కేంద్రాల్లో కాంటాలు అయిన ధాన్యం ఎత్తాలంటే రైతుల వద్దనుంచి అదనంగా డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయన్నారు. వర్షం వస్తే ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పలిన్లను కూడా అందింకపోవడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శమన్నారు. ఇప్పటికైన యుద్ధప్రాతిపదిక ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, పిల్లుట్ల సైదులు తదితరులున్నారు.

రెగ్యులరైజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల సమ్మె



తిరుమలగిరి : పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు



దామరచర్లలో నినాదాలు చేస్తున్న జేపీఎస్‌లు



దేవరకొండ : సమ్మెలో పాల్గొన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ దామరచర్ల మండలంలో జేపీఎస్‌లు చేస్తున్న సమ్మె శనివారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడారు. కార్యక్రమంలో జేపీఎ స్‌ల మండల అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సాయికుమార్, శ్రీను, కృష్ణ, మహేష్, నరేష్, నాగరాజు, అర్జున్‌రెడ్డి, శారద, రేవతి, నాగేశ్వర్‌రావు, శివ పాల్గొన్నారు.

దేవరకొండ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేవరకొండ మండల పరిధిలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. నిరవధిక సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సంధ్య, విజయ్, స్వామి, అనిల్, హరిత, రాజేశ్వరి, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 2019లో నియామకమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్ అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న శాంతియుత నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమలలో యాదవ సంఘం డివిజన్ కార్యదర్శి చేగొండి మురళియాదవ్, కార్యదర్శుల సంఘం నాయకులు శివ, సతీష్, మహేష్, శైలజ, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

డిండి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేణు, హరి, వెంకటేష్, సూర్య రాజు, రమేష్, నాగనాగేంద్రమ్మ, అనూష పాల్గొన్నారు.

మాడుగులపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మారుతి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె రెండో రోజు శనివారం కొనసాగింది. సర్పంచుల సంఘం తరఫున మద్దతు ప్రకటించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అలుగుబెల్లి గోవిందరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దవూర : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తూ నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని సీనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు పానుగోతు ధాకునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జేపీఎస్, ఓపీఎస్‌లు చేపడుతున్న శాంతియుత నిరవధిక సమ్మెకు శనివారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మునీర్, అనిల్, విజయ్, ముంతాజ్, బాలు, పావని, అనూష, మాధవి, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్‌ను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జరుగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కార్యదర్శుల సమ్మె శనివారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో కె.వాసుదేవారెడ్డి, చితంల శ్రీనివాస్, దీరావత్ సురేష్, పల్ల ప్రవీణ్, వి, ఆది, రమేష్, కళ్యాణి, శారద, శోభన్, రాంబాబు పాల్గొన్నారు.

చందంపేట : న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. నేరెడుగొమ్ము మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో భాగంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నేరెడుగొమ్ము మండల అధ్యక్షుడు నిరంజన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సాయిచరణ్, బాల్‌రాజు, శైలేందర్, జావీద్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : జూనియర్ పంచాయితీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సీపీఎం పార్టీ నాయకులు సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, పార్టీ మండల కార్యదర్శి శంకర్ నాయక్, నాయకులు రవి, పుల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవి, శ్రీను, ఏపీఎస్, జేపీఎస్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకొస్తేనే మద్దతు ధర



త్రిపురారంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ

త్రిపురారం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని మిర్యాలగూడ ఇన్‌చార్జ్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ జయ చంద్రారెడ్డి పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్ ఎంట్రీలు సకాలంలో పూర్తి చేయాలని, రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. వాతావరణం మారుతున్నందున కేంద్రాల్లో కాంటా బస్తాలు నిలువలేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం తహసీల్దార్ కేసీ ప్రమీలా, ఆర్ సైదులు, ఝాన్సీ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిడమనూరు : ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని మిర్యాలగూడ ఇన్‌చార్జ్ ఆర్డీఓ జయచందారెడ్డి నిర్వాహకులకు సూచించారు. శనివారం మండలంలోని వేంపాడ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన బస్తాలను వెంటనే మిల్లుకు తరలించాలని సూచించారు. కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీళ్లు పూర్తి స్థాయిలో అందించాలి



మిషన్ భగీరథ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న రేపాల శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీళ్లను పూర్తి స్థాయిలో అందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడ మండలం అవంతిపురంలో గల మిషన్ భగీరథ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం ప్రజల పడుతున్న ఇబ్బందులను వివరించడంతో పాటు నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ మున్సిపాలిటీలో పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి 10 ఎంఎల్‌డీ, మిషన్ భగీరథ నుంచి మరో 10 ఎంఎల్‌డీ నీరు మున్సిపాలిటీకి వస్తే ప్రజలకు నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట మిషన్ భగీరథ అధికారులు రవికుమార్, రమేష్‌రెడ్డిలతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వీఓఏల భిక్షాటన



గుర్రంపోడులో భిక్షాటన చేస్తున్న వీఓఏలు

గుర్రంపోడు : ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తమ ఆందోళనలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు శనివారం మండలకేంద్రంలో భిక్షాటన చేశారు. సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏ ల సంఘం అధ్యక్షురాలు సల్వాది సైదమ్మ, బొంగరాల రుద్ర, ఆవిరాల లక్ష్మి, వడ్లమల్ల యాదయ్య, గనిపల్లి వెంకన్న పాల్గొన్నారు.

పెద్దవూర : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చిలుముల దుర్గయ్య మాట్లాడారు. నాయకులు పాతనబోయిన పద్మ, పాల్తీ శంకర్, వీరబోయిన పద్మ, తరి బిక్షం, చెన్ను రజిత, మేడారం సత్యనారాయణ, రమేష్‌రాథోడ్, రాజేందర్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని రహదారి బంగ్లాలోకి మార్చుతాం



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

గుర్రంపోడు : మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని గ్రామ ప్రజలకే గాక నిత్యం మండలకేంద్రానికి గ్రామాల నుంచి వచ్చే వారు కూడా వినియోగించుకునేలా ప్రధాన రహదారి వెంట గల రహదారి బంగ్లాలోకి మార్చేలా చూస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. వినియోగంలో లేని రహదారి బంగ్లాను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి గ్రంథాలయాన్ని ఇందులో కొనసాగించేలా కలెక్టర్ అనుమతి తీసుకుంటామన్నారు. చైర్మన్ వెంట మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, సర్పంచ్ షేక్ మస్రత్ సయ్యద్‌మియా, లైబ్రేరియన్లు జాన్ నిషాంతం, కుసుమ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న రాములునాయక్

దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సకాలంలో ఎంతో మంది రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో రక్తదాన శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయనన్నారు. అనంతరం ఎన్‌వీటీ మాట్లాడుతూ ఇప్పటివరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో 31రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఉమామహేశ్వర్, భాస్కర్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, రమేష్, శ్రీను, ఖాజా, జగన్, వైద్యులు రవి, హరిప్రియ పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభ పోస్టర్ ఆవిష్కరణ



దేవరకొండ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరకొండ : మే 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ మండలం ముదిగొండలో సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భరోసా సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన కోరారు. భరోసా సభకు దేవరకొండ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఎస్పీ నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొట్టెం శేఖర్,ప్రశాంత్, చింటు, సంహాద్రి, మగ్దూం, జాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చింతపల్లి : తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర కృష్ణ జాంభవ కోరారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 7న హైదరాబాద్ సరూర్‌నగర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రమేశ్, మొగిలయ్య, శ్రీకాంత్, అంబేద్కర్, శ్రీశైలం , గిరి, సైదులు, యాదగిరి, కోటేశ్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ





తల్లిదండ్రులతో ధీరజ్‌నాయక్   అంజికుమార్

మిర్యాలగూడ : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు శనివారం కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, డైరెక్టర్లు హనుమంతరెడ్డి, పీఎల్ఎన్.రెడ్డి, నరేందర్ రెడ్డి, చైతన్యలు తెలిపారు. అంజికుమార్ 98.83 పర్సంటైల్‌తో ఎస్టీ కేటగిరిలో ఆలిండియా 2,535వ ర్యాంకు, ఎం.రాకిన్ 11,349, ఎస్.ఇందు 20,336, సాయి విశ్వ 22,487, అఖిల 25,229 ర్యాంకులను ఓపెన్ కేటగిరిలతో పాటు 90 పర్సంటైల్ సాధించి 30వేల ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు వారు తెలిపారు.

ఎస్టీ కేటగిరిలో ఆలిండియా 15వ ర్యాంక్

కొండమల్లేపల్లి : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కొండమల్లేపల్లి మండలం వద్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని సేవ్యతండాకు చెందిన నేనావత్ సేవ్యనాయక్, శైలజ దంపతుల కుమారుడు నేనావత్ ధీరజ్‌నాయక్ ఆలిండియా స్థాయిలో ఎస్టీ కేటగిరిలో 15వ ర్యాంక్ సాధించాడు. ధీరజ్‌నాయక్ ఉత్తమ ర్యాంక్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

450 కేజీల నల్లబెల్లం, 40 కేజీల పటిక పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 450 కేజీల నల్లబెల్లం, 40 కేజీల పటికను శనివారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామ శివారు గుండా ఇండికా కారులో నల్లబెల్లం, పటికను అక్రమంగా తరలిస్తున్నారు. అప్పటికే వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులకు కారులో ఈ నల్లబెల్లం , పటిక పట్టుబడింది. దీంతో వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు మండలంలోని కొత్తతండాకు చెందిన నేనావత్ లచ్చిరాం, నేనావత్ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



స్వామి వారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లిలోని కృష్ణనది ఒడ్డున గల బౌద్ధమ దేవాలయంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనమహోత్సవంలో భాగంగా శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వామివారి మూలవిరాట్‌తో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ యడవల్లి అనంతకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు తదితరులున్నారు.